క్లుప్తంగా

తురిమెళ్లలో ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ళ గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వరద ఆంజనేయస్వామి వారి దేవాలయ పదకొండవ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రామశేషగిరిరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళా భక్తులు ఆలయావరణలో పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిమంది భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారులను అంగన్ వాడీల్లో చేర్చాలి

ప్రాజెక్టు సీడీపీఓ బి.అరుణ



బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపూరు ప్రాజెక్టు సీడీపీఓ బి.అరుణ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ పిలుస్తోందిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. డయోరియా గురించి తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజరు ఎస్‌కె మస్తాన్‌బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా మందిరంలో అన్నదానం



క్రోసూరు: క్రోసూరులోని షిర్డీ సాయిబాబా మందిరంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయిబాబాకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు సందర్భంగా ప్రతి గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు తెలిపారు. ఉదయం మందిరంలో కాకడ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

ముగిసిన కౌలు రైతుల గుర్తింపు గ్రామ సభలు



సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు(సీసీఆర్సీ కార్డులు) మంజూరు చేసేందుకు సత్తెనపల్లి మండలంలో ఈ నెల 20న ప్రారంభమైన గ్రామ సభలు గురువారంతో ముగిశాయి. గురువారం సత్తెనపల్లి, వడ్డవల్లిలో గ్రామ సభలను నిర్వహించారు. సీసీఆర్సీ కార్డుల వలన కలిగే ఉపయోగాలను రైతులకు వివరించి, రైతుల్లో నెలకొన్న అపోహలను నివృత్తి చేశారు. కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ సభల్లో గ్రామ రెవెన్యూ అధికారులు వై.నాగార్జున, ఎస్.అనీల్, ఎంపీఈవో పి.చంద్రకళ, వీఏఏ ప్రశాంత్, కౌలు రైతులు రైతులు పాల్గొన్నారు.

మేలుచేసే వారికి తోడుగా నిలవండి

- న్యాయబద్ధంగా పనిచేసిన కార్యకర్తలకు బిల్లులు చెల్లించండి
- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, నాయకులు

నరసరావుపేట: ప్రజలకు మేలు చేసే పనులు చేసిన వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రూరల్ వాటర్ సరఫరా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలకు అవసరమయ్యే పనులు చేసి బిల్లులు రాక అవస్థలు పడుతున్న వారికి తక్షణమే బిల్లులు చెల్లించాలని సూచించారు. గత ఐదేళ్లుగా టీడీపీ కార్యకర్తలు బిల్లుల కోసం కాళ్లు అరిగేలా తిరిగారని, ఇప్పుడైనా అధికారులు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా బిల్లులు చెల్లించాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వం సామాన్య పౌరులకు మేలు చేయడమే లక్ష్యంగా ఎన్నో పనులు చేసిందని, అలాంటి పనులు చేసిన వారికి బిల్లులు రాక ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చిన్న సన్న కారు కుటుంబాలకు చెందిన వారు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారనీ, అందరికీ న్యాయం చేయాలని అధికారులు సూచించారు. అధికారులు కూడా బాధ్యతాయుతంగా నడుచుకోవాలని పేర్కొన్నారు. మనది ప్రజా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా మన అడుగులు ముందుకు పడాలని అధికారులను ఎమ్మెల్యే విన్నవించారు. నాయకులు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జేసీ గారు.. ప్రణాళికలు రూపొందించండి

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు సహా ప్రజలకు మేలు చేయడంలో ఎక్కడా రాజీ పడకుండా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌ని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. సమస్యల పరిష్కారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గం, రాష్ట్రాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వపరంగా కావల్సిన అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని, ప్రజలకు మేలు చేయడంలో ఉదారంగా వ్యవహరించాలని కోరారు.

వ్యాధిగ్రస్తులు బీసీజీ టీకా వేయించుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో హనుమ కుమార్



టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: టీబీ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా బీసీజీ టీకా చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డి.హనుమ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రం శావల్యాపురంలో బీసీజీ టీకా చేయు కార్యక్రమాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. టీబీ వ్యాధిగ్రస్తులు, షుగర్, సిగరెట్లు తాగే వారు, 60 సంవత్సరాల పైబడిన వారందరు బీసీజీ టీకా చేయించుకోవటం ఆరోగ్యకరంగా చాలా మంచిదన్నారు. అలాగే భవిష్యత్‌లో క్షయ వ్యాధి నియంత్రణకు దోహదపడుతుందన్నారు. గతంలో క్షయ వ్యాధిబారిన పడి ప్రస్తుతం మందులు వాడుకునే వారందరూ టీకా తీసుకోవాలన్నారు. దీనివల్ల ఎలాంటి సైడు ఎఫెక్టు ఉండదన్నారు. ఎత్తుకు తగిన బరువు లేని వారందరు కూడా ఈ టీకా కూడా చేయించుకోవాలన్నారు. ఇంటింటికీ ఆరోగ్య ఆశ కార్యకర్తలు తిరిగి షుగర్, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి బీసీజీ టీకాపై అవగాహన కల్పించి తదుపరి టీకా చేయాలన్నారు. జిల్లాలో ప్రతి గురువారం 10 వేల మందికి టీకా చేసేలా లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు ఏడు గురికి చేశామన్నారు. శావల్యాపురం మండలంలో గత నెల రోజుల వ్యవధిలో 2500 మందికి బీసీజీ టీకా చేశామన్నారు. బీసీజీ టీకా చేయటం ద్వారా భవిష్యత్‌లో క్షయ వ్యాధి నిర్మూలన పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. ఆయనతో పాటు జిల్లా టీబీ కోఆర్డినేటరు ఎస్.వెంకటేశ్వరరావు, వినుకొండ సీనియర్ సూపర్‌వైజరు రాజేశ్వరరావు, వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై దృష్టిసారించాలి

విద్యార్థులకు డీఈవో ఎం.వెంకటేశ్వర్లు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

నరసరావుపేట రూరల్: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. స్వస్థ భారత్ కార్యక్రమంలో భాగంగా లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, ఇందుకోసం ఆయాలను వినియోగించుకోవాలని సూచించారు. మరుగుదొడ్లు ప్రతిరోజు రెండుసార్లు ఆయాలతో శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. భోజనానికి ముందు, టాయిలెట్‌కు ముందు, తరువాత డెట్టాల్ లేదా సబ్బుతో చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమం నిరంతరం కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి డిప్యూటీ డీఈవో ఎం.వెంకటేశ్వర్లు, వేణు, ఏఎంవో ఏసుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి పాల్గొన్నారు.

అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ పనులు

ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట: ఎవరు చూస్తారు.. ఎవరు పట్టించుకుంటారు అనే నిర్లక్ష్య ధోరణి ఇక పై ఉద్యోగులు, అధికారులు వీడాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం రాత్రి రాత్రిపూట నిర్వహించే ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రా రెడ్డి, శానిటేషన్ సిబ్బందితో కలసి రోడ్లు ఊడ్చారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలన్నారు. పగలైతే వాహనాలు, ట్రాఫిక్ ఇబ్బంది ఉంటుందని, అందుకే రాత్రిపూట క్లీనింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే సమాజం శుభ్రంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మాపై బాధ్యత పెరిగిందని, ఇకపై ఇలాంటి నైట్‌డ్రైవ్స్ కొనసాగుతాయని సూచించారు. మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు నియోజకవర్గంలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్, వేల్పుల సింహాద్రియాదవ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాగరాజు

నరసరావుపేట: వచ్చే 7న తెలంగాణా జిల్లా వరంగల్ పట్టణంలో నిర్వహించే 30ఏళ్ల మాదిగల ఆత్మగౌరవ కవాతుకు మాదిగలు అందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు చిరుగూరి నాగరాజు మాదిగ కోరారు. గురువారం పట్టణంలోని కంభంపాలెంలో నిర్వహించిన మాదిగల చైతన్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఎస్సీలలోని అన్ని ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారంగా పంపిణీ జరగాలనే అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటాలకు ఎమ్మార్పీఎస్ పురుడు పోసిందన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించి జూలై ఏడునాటికి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడి నేటికీ 30 ఏళ్లు కావస్తుందన్నారు. ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటంతో సమాజంలో అన్ని వర్గాలకు మేలు కలిగిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అతి త్వరలోనే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ శ్రేణులు డ్రెస్ కోడ్‌తో మాదిగల ఆత్మగౌరవ కవాతుకు లక్షలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షులు నిదానపు ఆనంద్ మాదిగ, ఉపాధ్యక్షులు బోదాల విజయ్ మాదిగ, విద్యార్థి నాయకులు బొమ్ము జాషువా, మేకల మోషే, తలారి చంటి పాల్గొన్నారు,

ఆదర్శప్రాయుడు నారాయణశ్రేష్ఠి



వెంకటనారాయణ శ్రేష్ఠి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేసిన తాడేపల్లి వెంకటనారాయణ శ్రేష్ఠి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కొనియాడారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ శ్రేష్ఠి 71వ సంస్మరణ సభ గురువారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, 75 సంవత్సరాల క్రితమే విద్య ప్రాధాన్యతను గుర్తించిన నాగసరపు సుబ్బరాయ శ్రేష్ఠి, వెంకటనారాయణ శ్రేష్ఠి కళాశాలను ఏర్పాటు చేసి పల్నాడుతో పాటు రాయలసీమ విద్యార్థులకు విద్యను అందించారని తెలిపారు. తాను కూడా కళాశాల విద్యార్థినే అన్నారు. కళాశాల ఏర్పాటుకు అప్పట్లోనే రూ.50 వేలు ఆర్థిక సహకారం అందివ్వటంతో పాటు ఆర్యవైశ్య విద్యార్థి వసతి గృహం ఏర్పాటు చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వెంకట నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకటఅప్పారావు, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ



కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డు అందజేస్తున్న ఏవో నరేంద్రబాబు

నరసరావుపేట రూరల్: కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రం(సీసీఆర్‌సీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.నరేంద్ర బాబు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడులో శుక్రవారం భూ యజమానులకు, కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నరేంద్రబాబు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకుడు, గ్రామ రెవెన్యూ అధికారిని అర్హులైన కౌలు రైతులు సంప్రదించి సీసీఆర్‌సీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పంట సాగు హక్కు పత్రం వలన ప్రభుత్వం నుంచి రైతులకు అందే లబ్ధి కౌలు రైతులకు అందుతుందని వివరించారు. పంటకు బీమా కల్పించడంతో పాటు పంట ఉత్పత్తులను మద్దతు ధరకే విక్రయించేందుకు సీసీఆర్‌సీ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. జేఎల్‌జీ గ్రూపులకు బ్యాంక్‌ల నుంచి రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. అలాగే 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని 45 రోజుల తరువాత పూత, పిందె దశలో ఉన్నప్పుడు భూమిలో కలియ దున్నడం వలన భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ పి.శ్రీహర్ష, పంచాయతీ కార్యదర్శి ఎం.సతీష్, వీఆర్‌ఏ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కనపర్రులో స్టూడెంట్ కిట్ల పంపిణీ



నాదెండ్ల: కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామ టీడీపీ నాయకులు వజ్జా సింగయ్య, మల్లవరపు జయప్రసాద్, నరిశెట్టి చిన్నయ్య, షేక్ ఖాజామొహిద్దీన్‌లు విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే వసతులు వినియోగించి విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు బాలుర గురుకులంలో ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 28న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒట్టిప్రోలు జాన్సన్ గురువారం తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, తదితర వాటి ఆధారంగా ఆయా తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

సాగు సాయాన్ని వెంటనే చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చిలకలూరిపేట: ప్రభుత్వం ప్రకటించిన విధంగా సాగుసాయం కింద రైతులకు రూ. 20 వేలు వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు రూ. 3 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. గత రబీ కాలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతులకు వెంటనే చెల్లించాలన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి, వేరుశనగ, కంది తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీపై రైతాంగానికి అందించాలన్నారు. కల్తీ, నకిలీ విత్తనాలను అరికట్టేలా వ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పేలూరి రామారావు, రైతు సంఘం నాయకులు చంద్ర కొండలరావు, పర్వతనేని లక్ష్మాధికారి, పోతవరం మొహమ్మద్ సాహెబ్, చౌటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

నాదెండ్ల/యడ్లపాడు: రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరం ఒకటో సచివాలయంలో, యడ్లపాడు మండలం సొలస గ్రామంలో గురువారం కౌలు రైతులకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూసారాన్ని పెంచుకునేందుకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలన్నారు. ముందుగా రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుని తద్వారా పంటల సాగు చేసినట్లయితే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. పశువుల ఎరువులు దొరకని రైతులు జనుము, పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులను ఎంచుకొని సాగు చేసి దుక్కిలో కలియదున్నాలన్నారు. జీవ సంబంధిత ఎరువులైన వామ్, అజిటోబాక్టర్, అజోస్పైరిల్లమ్ వంటివి వాడటం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చన్నారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ, ప్రస్తుతం ఖరీఫ్‌లో పత్తి, మిరప పంటలు సాగు చేయాల్సిన పద్ధతులపై తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకుని ఖరీఫ్‌లో పంట నమోదు ద్వారా ఆ రైతులకు అకాల వైపరీత్యాలు జరిగినపుడు ఉచిత పంటల బీమా, సబ్సిడీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల ఏవో హరిప్రసాద్, యడ్లపాడు ఏవో సరిత, ఒకటో వార్డు కౌన్సిలర్ తులం సుధాకర్, వీఆర్వోలు వెంకట రమణ, సాంబశివరావు, అంకమ్మరావు, వీర య్య, వ్యవసాయశాఖ సహాయకులు జీవన్‌నాయక్, లక్ష్మానాయక్, అశోక్ రెడ్డి, వెంకటేష్, యడ్లపాడు ఎంపీటీసీ ఎం శ్రీనివాస రెడ్డి, వీఆర్వో నాగజ్యోతి, సర్పంచ్ డి వెంకయ్య, వీహెచ్‌ఏలు జ్యోత్స్న, జిల్లా రైతు సంఘం నాయకులు వీరారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుపై భూ యజమాని, కౌలు రైతు సంతకాలు ఉండాలి

కౌలు రైతులకు సూచించిన వ్యవసాయాధికారి శివ లలిత



రొంపిచర్ల: కౌలు రైతు దరఖాస్తుపై భూ యజమానితో పాటు కౌలు రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.శివలలిత సూచించారు. మండలంలోని గోగులపాడు, వీరవట్నం గ్రామాల్లో గురువారం రెవెన్యూ వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ ఆర్సీ కార్డుల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. ప్రతి కౌలు రైతు విలేజ్ రెవెన్యూ అధికారి లాగిన్‌లో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. భూ యజమాని అంగీకారంతోనే కౌలు రైతు దరఖాస్తును ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్డుల వల్ల వ్యవసాయశాఖ తరఫున రైతులకు రాయితీపై వచ్చే విత్తనాలతో పాటు ఈ పంట నమోదు, పంట నష్టం జరిగినప్పుడు నష్ట పరిహారం మద్దతు ధరకు పంట దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు క్రాప్ ఇన్సూరెన్స్ తదితర ప్రయోజనాలు ఈ కార్డుల వల్ల చేకూరతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి కౌలురైతు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు, పలువురు కౌలు రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో చెదురు ముదురుగా వర్షాలు

రొంపిచర్ల: మండలంలో గురువారం చెదురు మదురుగా వర్షాలు కురిశాయి. మండల కేంద్రంలో 5.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం అధికారులు తెలిపారు. అన్ని గ్రామాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఇటీవల నెలకొన్న ఉక్కపోత వాతావరణానికి, వేడి గాలులకు ఈ వర్షం కాస్తంత ఉపశమనం కలిగించింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులు సాగుచేసిన మిను ము, పెసర పైర్లకు ఈ వర్షాలు ఊపిరినిచ్చా యి. మొక్కలు మొలిచి వడగాల్పులకు బెట్టకు వచ్చి ఎండిపోతాయనుకుంటున్న తరుణంలో చెదురుముదురు వర్షాలు లేత మొక్కలకు ప్రాణం పోశాయి అని రైతులు వెల్లడించారు.

తల్లీ.. వర్షించు!!








వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు మంచి దిగుబడులు రావాలని రైతులు గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. సాతులూరు గ్రామంలో కొలువైయున్న పోలేరమ్మ, మునిబందమ్మ, వినుకొండ అంకమ్మ, ఊర అంకమ్మ, మహాలక్ష్మమ్మ, రెడ్డిపేరంటాలమ్మ తల్లి, బొడ్డురాయిలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో అమ్మవార్లను బిందెలతో జలాభిషేకం చేశారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఖరీఫ్ ప్రారంభమైనా రోజురోజుకు వర్షాభావ పరిస్థితులు నెలకొనటం, పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉంటున్నాయని, వాతావరణం చల్లబడి మంచి వర్షాలు కురవాలని మొక్కుకున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించుకునేలా కరుణించాలని కోరుకున్నారు.

–నాదెండ్ల

చాగంటివారిపాలెంలో ఆయుర్వేద వైద్య శిబిరం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో జెరియాట్రిక్ క్యాంపు గురువారం నిర్వహించారు. శిబిరంలో మండల ఆయుర్వేద వైద్యశాల వైద్యులు పి.సరళ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్, ఆయాసం, కిడ్నీ సమస్యలు, మోకాళ్ల నొప్పులు వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించినట్లు వైద్యురాలు సరళ తెలిపారు. మొత్తం 122 మందికి వైద్య సేవలందించామన్నారు. దీర్ఘకాలికంగా నయం కాని వ్యాధులను సైతం ఆయుర్వేద వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చని, మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కాంపౌండర్ సునీత, అటెండర్ రమేష్, యోగా ఇన్‌స్ట్రక్టర్ సరిత, తదితరులు పాల్గొన్నారు.